
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఆదమరిస్తే.. అంతే సంగతి

అధికారుల నిర్లక్ష్యం..
ప్రజల ప్రాణాలతో చెలగాటం
మెదక్ మున్సిపాలిటీలో
అధ్వానంగా రహదారులు
పట్టించుకోని అధికారులు
6



దాయర-గాంధీనగర్ రోడ్డు



హవేలీఘనపూర్ మండలం బ్యాతోల్‌లో సర్పంచ్‌గా నామినేషన్ వేస్తున్న అభ్యర్థి

నామినేషన్లు షురూ

మెదక్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పంచాయతీ ఎన్నికల హడావుడి ఊపందుకుంది. మెదక్ జిల్లాలో తొలివిడత ఎన్నికలు నిర్వహిస్తున్న ఆరు మండలాల్లోని 160 గ్రామాల్లో తొలిరోజు గురువారం సర్పంచ్ స్థానాలకు 55 నామినేషన్లు దాఖలయ్యాయి. అల్లాదుర్గం మండలంలో 6, రేగోడ్ 7, పెద్దశంకరంపేట 8, టేక్మాల్ 5, పాపన్నపేట 13, హవేలీఘనపూర్‌లో 15 మంది నామినేషన్లు వేశారు.

అల్లాదుర్గం మండల పరిధిలో అల్లాదుర్గం 2, చిల్వేర్ 1, ముప్పారం 1, అప్పాజిపల్లి 2, రేగోడ్ మండలంలో వెంకటాపూర్ 1, సిందోల్ 1, టి.లింగాయిపల్లి 1, పోచారం 1, ఆర్ ఇటిక్యాల 1, చౌదరిపల్లి 1, పెద్దశంకరంపేట మండలంలో ఉత్తలూరు 1, టెన్‌కటి 1, పెద్దశంకరంపేట 1, మూసాపేట 1, వీరోజుపల్లి 2, రామోజిపల్లి1, కొల్లపల్లి 1, టేక్మాల్ మండలంలో కోరంపల్లి 1, ధనూర 1, తంపలూర్ 1, మల్కాపూర్ 2, పాపన్నపేట మండలంలో నర్సింగరావు తండా 1, గాంధారిపల్లి 1, మల్లంపేట్ 1, టాక్యాతండా 1, రామతీర్థం 1, యూసూఫ్‌పేట 1, ఆరెపల్లి 1, కొత్తపల్లి 2, కొత్త లింగాయిపల్లి 1, చీకోడ్ 1, పొడ్చన్‌పల్లి 2, హవేలీ ఘనపూర్ మండలంలో బ్యాతోల్ 2, తిమ్మాయిపల్లి 1, లింగ్సాన్‌పల్లి 2, బూర్గుపల్లి 1, మదుల్వాయి 1, ముత్తాయికోట 1, కూచన్‌పల్లి 1, కొత్తపల్లి 2, రాజ్‌పేట 2, పోచంరాల్ 1, వాడి 1 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. టేక్మాల్ మండలంలో 1, హవేలీఘనపూర్ మండలంలో మూడు వార్డులకు దరఖాస్తులు దాఖలయ్యాయి.


సంగారెడ్డి జిల్లాలో 147

సంగారెడ్డి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గురువారం తొలివిడతగా సంగారెడ్డి జిల్లా పరిధిలో తొలిరోజు సర్పంచ్ పదవులకు 147, వార్డుల స్థానాలకు 149 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలో తొలివిడతలో సంగారెడ్డి డివిజన్ పరిధిలోని కంది, సదాశివపేట, కొండాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు, గుమ్మడిదల, హత్నూర మండలాల్లో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

మేలుకో.. ఏలుకో..!

ఉమ్మడి జిల్లాలో మహిళల ఓట్లే కీలకం

పురుషుల కన్నా 40వేల ఓట్లు అధికం
అతివలను ఆకర్షించేలా ఆశావహుల ప్రచారం
స్వయంసహాయక సంఘాలపై ఫోకస్
దాదాపు సగం సీట్లలో మహిళల పోటీ



గ్రామపంచాయతీ ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురుషుల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. ఈ క్రమంలో బరిలో నిలిచే అభ్యర్థులు సైతం తమ దృష్టిని మళ్లించారు. మహిళలను ఆకర్షించే విధంగా ప్రచారంపై ఫోకస్ పెడుతున్నారు. మగవాళ్ల ఓట్లు అటుఇటు అయ్యే అవకాశం ఉంటుందని.. మహిళల ఓట్లు నమ్మకంగా పడతాయని లెక్కలు కడుతున్నారు. ఇక సగం సీట్లు మహిళలకే కేటాయించడంతో వారు కూడా తమదైన శైలిలో ప్రచారం ప్రారంభించారు.

సంగారెడ్డి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటింటా తిరిగి ప్రచారం చేయడంతోపాటు మహిళా సంఘాలను ప్రసన్నం చేసుకుంటే గంపగుత్తగా ఓట్లు పడతాయని అభ్యర్థులు ఆలోచిస్తున్నారు. మహిళా గ్రూపు లీడర్ అనుకుంటే ఇతర సభ్యులను ఒప్పించి తమకు అనుకూలంగా ఓట్లు వేయిస్తారని భావిస్తున్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లోనూ ఇదే పంథాను అనుసరించి గెలిచినవాళ్లూ ఉన్నారు. ఇక మహిళా సంఘాల సమావేశాల్లో, వ్యవసాయ పనులకు వెళ్లిన చోట పాజిటివ్ ప్రచారం రావాలన్నా మహిళలతోనే సాధ్యమవుతుందని ఆశిస్తున్నారు. అవసరమైతే తమ ఇళ్లలోని మగవాళ్లు, పెద్దలు, యువత ఓట్లను సైతం మహిళలు ప్రభావితం చేస్తారని అంచనా వేస్తున్నారు. అందుకే మహిళలను తమవైపు తిప్పుకోవడం పైనే అభ్యర్థులు ప్రధానంగా దృష్టి పెట్టారు.

ఓట్లు ఎక్కువ.. సీట్లు తక్కువ

ఓట్ల పరంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో మహిళలే అధికంగా ఉన్నారు. కానీ సీట్ల విషయానికి వస్తే పురుషులకు ఎక్కువ కేటాయించారు. అయితే జనరల్ స్థానాల్లో కూడా మహిళలకు పోటీ చేసే వీలు ఉండడం కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలకు 738 సర్పంచ్ సీట్లు కేటాయించగా.. 875 జనరల్ పురుషులకు స్థానాల్లో పోటీ చేసే అవకాశాన్ని కల్పించారు. మహిళల కంటే 137 స్థానాలు జనరల్ కేటగిరీలో ఎక్కువ ఉన్నాయి. వార్డుల్లో మహిళలకు 6,130 స్థానాలు రిజర్వ్ చేయగా.. 7,968 సీట్లను జనరల్ కేటగిరీగా ప్రకటించారు. మహిళలకు 50 శాతం సీట్లను కేటాయించలేదని పలువురు అసహనం వ్యక్తపరుస్తున్నారు. అయితే, చాలాచోట్ల పురుషులు తెర వెనుక ఉంటూ తమ భార్యలను జనరల్ స్థానాల్లో బరిలో దింపే అవకాశం ఉంటుందని అంచనావేస్తున్నారు.

ఓటర్ల వివరాలు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మెదక్	2,51,532	2,71,787	08	5,23,327
సంగారెడ్డి	3,68,270	3,75,843	44	7,44,157
సిద్దిపేట	3,21,766	3,34,186	06	6,55,958
మొత్తం	9,41,568	9,81,816	58	19,23,442

కేటాయించిన సర్పంచ్ స్థానాలు

జిల్లా	మొత్తం సీట్లు	మహిళలకు	శాతం	జనరల్	శాతం
మెదక్	492	223	45.33	269	54.67
సంగారెడ్డి	613	283	46.16	330	53.83
సిద్దిపేట	508	232	45.66	276	54.33

వార్డు స్థానాల కేటాయింపు

జిల్లా	మొత్తంసీట్లు	మహిళలకు	శాతం	జనరల్	శాతం
మెదక్	4220	1812	42.94	2,408	57.06
సంగారెడ్డి	5370	2404	44.76	2,966	55.23
సిద్దిపేట	4508	1914	42.45	2,594	57.54

పారదర్శకంగా స్థానిక ఎన్నికలు

నిబంధనల మేరకు ఏర్పాట్లు : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



పాపన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో మొదటి విడత నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జార్వర్, మెదక్ కలెక్టర్

పాపన్నపేట/అల్లాదుర్గం/పెద్దశంకరంపేట/రేగోడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నిబంధనల మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పాపన్నపేట, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, రేగోడు మండలాల్లో నామినేషన్ల ప్రక్రియను గురువారం ఆయన ఎన్నికల అబ్జార్వర్ భారతి లక్పత్ నాయక్, అదనపు కలెక్టర్ నగేష్, డీపీవో యాదయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియలో పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ల దాఖలుపై అభ్యర్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. నామినేషన్ల ఫారాల్లో తప్పులుంటే సరిచేసుకునేందుకు సహకరించాలని తెలిపారు. ఎన్నికల ఖర్చుల కోసం తీసుకున్న ఖాతా వివరాలను అభ్యర్థులు నామినేషన్ పత్రంతో పొందపర్చాలని స్పష్టంచేశారు. అభ్యర్థులకు వెంటనే ఖాతాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పెంచాలని ఆదేశించారు.



ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో నామినేషన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ పంకజ్

ఎన్నికల నిబంధనలు

అతిక్రమిస్తే కఠిన చర్యలు

సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం/హత్నూర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట, ఫసల్‌వాది, హత్నూర మండలం కాసాల, దౌల్తాబాద్ తదితర గ్రామాల్లో ఎన్నికల ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి బందోబస్తును తనిఖీ చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఓటర్లను మభ్యపెట్టినా, ప్రలోభాలకు గురిచేసినట్లు తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఎవరినైనా కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హాస్టల్ విద్యార్థులకు స్వెటర్లు, దుప్పట్లు

జిల్లావ్యాప్తంగా 24 హాస్టళ్లలో 2,055 మందికి పంపిణీ



కొల్చారంలో హాస్టల్ విద్యార్థులకు స్వెట్టర్లు, దుప్పట్ల పంపిణీ చేస్తున్న అధికారులు

పాపన్నపేట/కొల్చారం/తూప్రాన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఉన్న 24 హాస్టళ్లలో 2,055 మంది విద్యార్థులకు స్వెటర్లు, క్యాప్‌లు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు మెదక్ జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. పాపన్నపేటలోని ఎస్సీ వసతిగృహంలో గురువారం విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేశారు. సందర్భంగా మాట్లాడుతూ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు చలి నుంచి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే, కొల్చారంలో ఉన్న ఎస్సీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులకు స్వెట్టర్లను వసతిగృహ సంక్షేమాధికారి పరశురాం అందజేశారు. సిబ్బంది నారాగౌడ్, యాదయ్య పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణంలోని సమీకృత బాలుర వసతి గృహం విద్యార్థులకు బ్లాకెట్లు, స్వెట్టర్లు, మంకీ క్యాపులు పంపిణీ చేసినట్లు తూప్రాన్ సహాయ సోషల్ వెల్ఫేర్ అధికారి లింగేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి జనార్దన్ పాల్గొన్నారు.



అబ్జర్వర్‌లు వచ్చేశారు..

నామినేషన్ల ప్రక్రియ పరిశీలన
అభ్యర్థులు నిబంధనల మేరకు నడుచుకోవాలి
ఎన్నికల సంఘం ప్రత్యేకాధికారి ఉదయ్‌కుమార్
7

సర్పంచ్‌గా పోటీకి.. ఏఎంసీ పదవికి టాటా

మల్కాపూర్ నుంచి బరిలోకి
సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్
7

పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

జిల్లాను రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలబెట్టాలి : సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



చేర్యాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

కంది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం చేర్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో జరుగుతున్న బోధనా పద్ధతులను పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థులను సిలబస్ ఎంతవరకు పూర్తయింది, రెగ్యులర్, ప్రత్యేక తరగతులు ఎలా జరుగుతన్నాయనే విషయాలను ఆమె వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతులు బాగా నిర్వహిస్తున్నారని, చక్కగా చదువుకుంటున్నట్లు విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థులందరికీ ప్రతిరోజూ స్నాక్స్ అందుతున్నాయా, మధ్యాహ్న భోజన నాణ్యతపై ఉపాధ్యాయులను కలెక్టర్ ఆరాతీసారు. పాఠశాల హాజరు శాతం, పదో తరగతి విద్యార్థుల ప్రిపరేషన్, మాక్ టెస్టులు ఎంతవరకు నిర్వహిస్తున్నారన్న అంశాలను ప్రత్యేకంగా సమీక్షించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు మరింత క్రమశిక్షణతో చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈసారి మంచి మార్కులు సాధించి పాఠశాల పేరును జిల్లా పేరును ఉన్నతంగా నిలబెట్టాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై మరింత ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన అకడమిక్ సపోర్ట్ అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట విద్యా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల గోస

ఎటూ తేలని 'కపాస్' పంచాయతీ
మొన్నటి వరకు 7 క్వింటాళ్లు..
ఇప్పుడు షరతులతో 12 క్వింటాళ్లు
వ్యవసాయ పనులు వదిలి
అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
ధరలోనూ రూ. 50 కోత



మునిపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా దిగుబడులు తగ్గి తీవ్రంగా నష్టపోయారు. ఈ తరుణంలో భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోళ్లలో పెడుతున్న ఆంక్షలు, విధానాలతో అన్నదాతలు మరింత ఆవేదన చెందుతున్నారు.

కపాస్ యాప్ కష్టాలు

సీసీఐ కొత్తగా ప్రవేశపెట్టిన కపాస్ యాప్‌లో పత్తి దిగుబడి, తేమ శాతం, తరలించే మిల్లు... తదితర వివరాలను నమోదు చేయాల్సి రావడం రైతులకు భారంగా మారింది. ఈ ఇబ్బందుల కారణంగా కొంత మంది రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దిగుబడి పరిమితులపై ఆంక్షలు

మొదట్లో ఎకరాకు 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పగా, ఈ నెల 25 నుంచి షరతులతో 12 క్వింటాళ్లు కొనుగోలు చేస్తామని సీసీఐ ప్రకటించింది. ఎకరాకు 12 క్వింటాళ్లు దిగుబడి వచ్చినట్లు నిరూపించడానికి రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుతో పాటు ఇద్దరు సాక్షుల సంతకాలతో వ్యవసాయ అధికారుల వద్ద ధ్రువీకరణ పొందాలి. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిజమని తేలితేనే కొనుగోలు చేస్తారు. విచారణలో దిగుబడి నిరూపించలేకపోతే రైతు ఖాతా సీజ్ చేయబడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. పత్తికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 8,110గా నిర్ణయించినప్పటికీ రెండోసారి తీసిన పత్తి తెస్తున్నారని సెకండ్ క్వాలిటీ పేరిట క్వింటాలుకు రూ. 50 తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కూలీల కొరతతో మొదటి సారి పత్తి తీయడానికే ఇబ్బందులు పడుతుంటే సెకండ్ క్వాలిటీ పేరిట ఇప్పుడు ధరను తగ్గించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో రైతన్నలు

కపాస్ యాప్‌ను తొలగించాలని, పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలని, కొనుగోలు పరిమితులైన ఎల్1, ఎల్2, ఎల్3 ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఇటీవల బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాయి. దీంతో స్పందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ అధికారులతో చర్చించి ఎల్1, ఎల్2, ఎల్3 నిబంధనలను ఎత్తివేశాయి. ఆ తర్వాతే మిల్లు యజమానులు కొనుగోళ్లు ప్రారంభించారు. మరోవైపు రైతులు తమ పంటను అమ్ముకోవడానికి వ్యవసాయ పనులు వదిలి అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా చూడాలని కోరుతున్నారు. గత ఏడాది మాదిరిగా ఎలాంటి షరతులు లేకుండా ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అలాగే, మరో పది రోజుల పాటు రూ. 50 తగ్గింపు లేకుండా పూర్తి మద్దతు ధర రూ. 8,110 ఇవ్వాలని కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర బ్యాటరీ దొంగల అరెస్ట్

● రూ. 6లక్షల నగదు, నాలుగు వాహనాలు స్వాధీనం

● పరారీలో ఇద్దరు నిందితులు

కుకునూరుపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాహనాల బ్యాటరీలను దొంగలిస్తున్న నిందితులను కుకునూరుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, తొగుట సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన ఎం.డీ రహీం పెయింటర్‌గా పనిచేస్తూ వచ్చే డబ్బు సరిపోకపోవడంతో వాహనాలలో ఉండే బ్యాటరీలను దొంగిలించి వచ్చే డబ్బుతో జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. దొంగిలించిన బ్యాటరీలను పకడ్బందీగా మరో ముగ్గురితో కలిసి ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద ఉన్న ఓషాపులో అమ్ముతున్నారు. ఇలా మెదక్, సిద్దిపేట, వరంగల్, భువనగిరి, నల్గొండ, జగిత్యాల జిల్లాల్లో వరుస బ్యాటరీల దొంగతనాలకు పాల్పడుతుండడంతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి పట్టుకున్నారు. రహీం దొంగిలించిన బ్యాటరీలు ఎండీ యాకూబ్, మహమ్మద్ అల్తాఫ్, మహ్మద్ మీనజ్‌లకు అమ్ముతున్నాడు. వీరందరూ కలిసి మరిన్ని దొంగతనాలకు పథకం వేసి అనంతరం పెద్ద వ్యాపారం ఏర్పాటు చేసుకుందామని నిర్ణయించుకున్నారు. కానీ గురువారం ముద్దాపూర్ ఎక్స్ రోడ్ వద్ద పోలీసులకు చిక్కారు. జగిత్యాల జిల్లాకు చెందిన నరసింహ, రిషబ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి 40 బ్యాటరీలు, రూ. 6లక్షల నగదు, దొంగతనానికి ఉపయోగించిన పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలు జిల్లాల్లో వీరిపై 20కి పైగా కేసులు నమోదయ్యాయి. అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్న సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బందిని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు నిర్మాణంపై హైడ్రా పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న హైడ్రా సీఐ బాలగోపాల్

పటాన్‌చెరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు సాకి చెరువుకు ఆనుకొని ఇంకార్ అనే సంస్థ చేస్తున్న రోడ్డు నిర్మాణంపై కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు పరిశీలన చేశారు. చెరువు కట్టకు 30మీటర్ల దూరంలో మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని సీఐ బాలగోపాల్ చెప్పారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో జాయింట్ సర్వే జరుగుతున్న సమయంలో తాము భాగస్వామ్యులుగా ఉంటామని వివరించారు. అప్పటి వరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని నిర్మాణదారులకు చెప్పారు.

భూ ఆక్రమణదారులపై కేసు

పటాన్‌చెరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించి అమ్మకాలు జరుపుతున్న నలుగురిపై కేసు నమోదయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వినాయకరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఇస్నాపూర్ పురపాలక పరిధి చిట్కుల్ గ్రామంలోని ప్రభుత్వానికి చెందిన 329 సర్వేనంబరులో నాగేందర్, వంశీ, పెద్దరాములు, కృష్ణ, కోటేష్‌లు అనే వ్యక్తులు ఇష్టారీతిన భూమి అమ్మకాలు జరుపుతున్నారు. హెచ్చరికలు జారీ చేసినా పట్టించుకోకుండా అమాయకులైన కొనుగోలు దారులను మోసం చేస్తున్నారని తహసీల్దార్ రంగారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆదమరిస్తే..అంతే సంగతి

● అధ్వానంగా మెదక్ మున్సిపాలిటీ కల్వర్టులు ● అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రమాదం జరిగాక.. అయ్యో ఇలా జరిగిందా.. ముందే అధికారులు స్పందిస్తే బాగుంటుండేదేమో అనుకోవడం మనకు పరిపాటే.. కానీ ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాత్రం అధికారులను నిలదీయకపోవడంతో వారిలో స్పందన కరువైందనే చెప్పవచ్చు. ఇందుకు ఉదహరణగా జిల్లా కేంద్రంలోని మెదక్ మున్సిపల్ పరిధిలోని దాయర మీదుగా గాంధీనగర్ వెళ్లే రహదారి నిదర్శనంగా మారింది. అంతేగాకుండా సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు కూలిపోవడం.. అటుగా వెళ్లే ప్రయాణికులు ప్రాణాలు అరిచేతిలో పట్టుకొని వెళ్తున్నారు. రహదారి మధ్యలో సగభాగం కూలిపోయి భారీ రాళ్లు రోడ్డుపై అడ్డంగా ఏర్పాటు చేయడంతో మరింత ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. ఈ విషయమై స్థానిక మాజీ కౌన్సిలర్ రాజలింగం మున్సిపల్ అధికారులకు వర్షాకాలం నుంచి ఫిర్యాదు చేస్తున్నా ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఒక ఆర్‌సీసీ పైప్ వేసి మట్టితో పూడ్చుదామన్నా నిధులు లేవంటూ జారుకుంటున్నారని అసహనం వ్యక్తంచేశారు. వీధి దీపాలు కూడా లేని ఆ ప్రాంతంలో రాత్రివె ళ్లే వాహనాలు ఎక్కడ అందులో పడుతాయోనని భయంగా ఉందన్నారు.



దాయర మీదుగా గాంధీనగర్ వెళ్లేదారిలో కూలిన కల్వర్టు



కోలిగడ్డ కామునికంత వద్ద కూలడానికి సిద్దంగా ఉన్న మరో కల్వర్టు

కోలిగడ్డకు వెళ్లే దారిలో..

ఇక్కడే కాకుండా కోలిగడ్డకు వెళ్లే దారిలోని కామునికంత వద్ద కూడా పురాతన కల్వర్టు కూలడానికి సిద్దంగా ఉండగా ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కల్వర్టు రాళ్లు తేలడంతో కంకర పొడి వేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం కోట్ల రూపాయలతో పట్టణం అభివృద్ధి చేసేందుకు ప్రణాళికు రచించడం కంటే ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ముందుగా చిన్న చిన్న మరమ్మతులు చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నాలుగో బిడ్డను సాకలేనని..

● గర్భస్రావం మాత్రలు మింగిన తల్లి

● రక్తపు గూడును చెరువు వద్ద పడేసేందుకు యత్నం

● తల్లితోపాటు ఆర్ఎంపీ అరెస్ట్

గజ్వేల్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అప్పటికే ఆమెకు ముగ్గురు పిల్లలు. భర్త ఏ పనీ చేయడు. పూట గడవడమే కష్టంగా ఉన్న పరిస్థితి. ఈ క్రమంలో ఆమె మరోసారి గర్భందాల్చింది. పుట్టే బిడ్డను పోషించలేనని భావించింది. అబార్షన్ కోసం ఆర్ఎంపీని ఆశ్రయించింది. ఆరునెలలకే గర్భస్రావం కావడంతో ఆ నెత్తుటి గూడును చెరువు గట్టున పడేసింది. స్థానికులు నిలదీయడంతో పోలీసులు ఆమెతో పాటు ఆమెకు అబార్షన్ మాత్రలు ఇచ్చిన ఆర్ఎంపీని అరెస్ట్ చేశారు. గజ్వేల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. గజ్వేల్ పట్టణం రాజిరెడ్డిపల్లికి చెందిన బొమ్మ భార్గవి(27) భర్త ఏ పనీ చేయకుండా ఖాళీగా తిరుగుతుంటాడు. అప్పటికే ఆమెకు ఎనిమిదేళ్ల మహాలక్ష్మి, ఐదేళ్ల అఖిల్ అనే బాబు, ఏడాదిన్నర పాప కావ్య ఉన్నారు. భార్గవే కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ క్రమంలో ఆమె మరోసారి గర్భం దాల్చింది. ఇప్పటికే ఉన్న ముగ్గురు బిడ్డలకు సరిగ్గా తిండిపెట్టలేని ఆ తల్లి నాలుగో బిడ్డను పోషించలేనని మదనపడింది. ఎలాగైనా అబార్షన్ చేయించుకోవాలని పట్టణంలోని ఆర్ఎంపీ ఇప్ప రవిని సంప్రదించింది. అతను అబార్షన్ అయ్యేందుకు మాత్రలు ఇచ్చాడు. బుధవారం రాత్రి సదరు మాత్రలు వేసుకోగా, గురువారం ఉదయం అబార్షన్ అయింది. మృత ఆడశిశువును సంచిలో పెట్టి పట్టణ శివారులోని రాజిరెడ్డిపల్లి కుంట వద్ద పారేసేందుకు వెళ్లగా, అనుమానం వచ్చిన స్థానికులు నిలదీశారు. దీంతో ఆమె జరిగిన విషయాన్ని బయటపెట్టింది. రంగంలోకి దిగిన పోలీసులు తల్లితో పాటు ఆర్ఎంపీ ఇప్ప రవిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్‌లో మీ సేవ..

అక్కన్నపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏదైనా సర్టిఫికెట్స్ దరఖాస్తు చేయాలంటే మీసేవకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం మీ సేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా నేరుగా మొబైల్‌లో వాట్సాప్ ద్వారానే సేవలు పొందేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ డిజిటల్ సేవలను ఈ నెల 18న మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఇక పైన వాట్సాప్‌లో మెసేజ్ పెడితే 20కి పైగా మీసేవ సర్వీసులను పొందవచ్చు. వాట్సాప్‌లో 8096958096 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే చాలు వెంటనే రిప్లైలో మెనూ వస్తుంది. కావాల్సిన సేవలను ఎంచుకొని దరఖాస్తు చేసుకోవచ్చు. ఎప్పటికప్పుడు అప్డేట్‌తో పాటు ఆమోదం పొందిన సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించారు. ఈ విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభంగా వేగంగా అందుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

అందుబాటులో ఉండే సేవలు ఇవే..

ప్రస్తుతం 20కి పైగా సేవలను వాట్సప్ ద్వారా అందుబాటులో ఉన్నాయి. మరిన్ని సేవలను చేర్చే పనిలో అధికారులు ఉన్నారు. ఇక మొబైల్ ఫోన్ ద్వారానే ఆదాయం, నివాస ధృవీకరణ పత్రం, బర్త్, డెత్ సర్టిఫికెట్స్‌కు దరఖాస్తు చేసుకొని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నల్లా, కరెంటు బిల్లులు, పోలీస్ చలాన్స్, ఆర్టీఏ లైఫ్ ట్యాక్స్ చెల్లించవచ్చు. ఇళ్ల నిర్మాణాలకు గ్రామ పంచాయతీ పర్మిషన్లు, పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో మ్యూటేషన్ దరఖాస్తులు, ఆస్తి పన్నులు చెల్లించుకోవచ్చు. దేవాలయాల సమాచారం, దైవ దర్శనాల స్లాట్ బుకింగ్, గదుల బుకింగ్, ఆన్‌లైన్ పూజా బుకింగ్ సౌలభ్యం కూడా ఉంది. రేషన్ కార్డుల జారీ, రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్, వ్యవసాయ మార్కెట్ ధరలు ఇలా పలు రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

గృహిణి ఆత్మహత్య

పటాన్‌చెరు నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల గొడవతో గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సా రాష్ట్రం జగత్‌సింగ్‌పూర్‌కు చెందిన రోజాలిన్ పాండా (30) భర్త స్మిత్‌రంజన్‌పాండాతో కలిసి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉంటుంది. భర్త ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం భర్త బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చే సమయానికి రోజాలిన్ పాండా ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రోజాలిన్ అక్క అపరాజిత్ పాండా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కూలి కోసం వచ్చి శవంగా..

రామాయంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూలి పని కోసం వచ్చి స్నానం చేసేందుకు చెరువులో దిగిన వృద్ధుడు కాలు జారిపడి చనిపోయాడు. ఘటన మూడు రోజుల క్రితం జరగగా గురువారం మృతదేహం బయటపడింది. ఎస్సై బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం బాగిర్తి పల్లికి చెందిన కోటిడి గట్టయ్య (59) ఈనెల 24న రామాయంపేటకు పని నిమిత్తం వచ్చాడు. స్నానం చేసేందుకని అక్కడి కొత్తచెరువులో దిగి అకస్మాత్తుగా దానిలో పడి చనిపోయాడు. గురువారం అటుగా వెళ్లిన పలువురు మృతదేహాన్ని చూసి పోలీసులకు చెప్పారు. ఘటనా స్థలానికి వెళ్లిన ఎస్సై ఆనవాళ్ల ఆధారంగా శవాన్ని గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మహిళ అదృశ్యం



గీతాదేవి(ఫైల్)

రామాయంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రం నుంచి కూలి పని కోసం వచ్చిన మహిళ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండల పరిధి దామరచెరువు గ్రామ శివారు పౌల్ట్రీ ఫామ్‌లో ఆమెతో మరో 9 మంది పని కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం గీతాదేవి(45)అనే మహిళ అదృశ్యమైంది. ఈ మేరకు గురువారం తమకు ఫిర్యాదు రాగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాలరాజ్ తెలిపారు.

టమాటా ఏజెంట్‌ను మోసం చేసిన ఇద్దరికి రిమాండ్

సిద్దిపేటరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టమాటాల ఏజెంట్‌ను మోసగించిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీను తెలిపారు. గురువారం రూరల్ పీఎస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18న సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామంలో రైతు జయరాంరెడ్డికి చెందిన తోటలో టమాటా లోడు ఉన్నాయని బండి పెట్టాలని జమ్మికుంటకు చెందిన వ్యాపారి గుర్రం పరుశురాములుకు మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన నెవూరు శేఖర్ రెడ్డి, దుబ్బాక మండలం గంబీర్‌పూర్ గ్రామానికి చెందిన మ్యాదరి కృష్ణ మనోహర్‌లు కోరారు. పరుశురాములు 18వ తేదీన అతడి హమాలీని, డ్రైవర్‌ను లోడు కోసం బుస్సాపూర్ గ్రామానికి పంపాడు. శేఖర్ రెడ్డి, మనోహర్‌లు రైతులకు తెలియకుండా పర్శరాములు నుండి రూ. 50 వేలను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. రైతు పరుశురాములను డబ్బులు అడగడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు పిర్యాదు చేయగా కేసు నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 50 వేల తో పాటు 3 సెల్ ఫోన్‌లు, ఒక పల్సర్ బైక్ ను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు పంపారు. నిందితులను పట్టుకోవడానికి చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై రాజేష్, కానిస్టేబుల్ రాజు, విష్ణులను రూరల్ సీఐ శ్రీను అభినందించారు

సర్పంచ్‌గా పోటీకి.. ఏఎంసీ పదవికి టాటా

మల్కాపూర్ నుంచి బరిలోకి సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్



సదాశివపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా సదాశివపేట మార్కెట్ కమిటీ(ఏఎంసీ) పదవి నాలుగేళ్లుగా ఆయన ఇంటికే సొంతం. ఒకమారు భార్య చైర్‌పర్సన్ పదవి నిర్వర్తించగా, ప్రస్తుతం భర్త చైర్మన్‌గా ఉన్నాడు. రెండు మండలాలు 54 గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీకి చైర్మన్‌గా ఉండి, ఒక గ్రామ సర్పంచ్ పదవి కోసం రాజీనామా చేశాడు. ఆయనే సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన సడాకుల కుమార్. 2022లో సడాకుల కుమార్ సతీమణి సడాకుల కృప రెండేళ్లు సదాశివపేట ఏఎంసీ చైర్‌పర్సన్‌గా పదవిలో ఉన్నారు. 2024లో భర్త కుమార్ నియమితులయ్యారు. సొంత గ్రామం మల్కాపూర్‌లో సర్పంచ్‌గా నెగ్గాలని, మద్దతుదారులు, శ్రేయోభిలాషులతో చర్చించిన కుమార్ ఈ నిర్ణయం తీసుకున్నారు. బుధవారం ఏఎంసీ చైర్మన్ పదవికి రాజీనామా సమర్పించారు. కుమార్ రాజీనామా వ్యవహారం సదాశివపేట, కొండాపూర్ మండలాల్లో చర్చనీయాంశమైంది. ఆయన అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రం కుమార్ సర్పంచ్‌గా గెలుస్తాడనే ధీమాను కనబరుస్తున్నారు. చైర్మన్‌తో పాటు డైరెక్టర్, సదాశివపేట మండలం తంగడపల్లి గ్రామానికి చెందిన కె.శేఖర్ రాజీనామా చేశారు. తాను బరిలో నిలవనున్నారు.

హమ్మయ్య.. కాస్త ఖర్చు తగ్గుతుంది

క్లస్టర్ల వారీగా నామినేషన్ల స్వీకరణతో అభ్యర్థులకు కొంత ఉపశమనం



కోహీర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సర్పంచు, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు వేదికల్లో క్లస్టర్ల వారీగా తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నామినేషన్ల దాఖలు చేసేందుకు పెద్దఎత్తున డప్పుచప్పుల మధ్య ఎక్కువ మొత్తంలో ఖర్చు పెట్టుకుని మండల కేంద్రాలకు ర్యాలీగా చేరుకునేవారు. కానీ ఈసారి మండలానికి దాదాపు ఐదు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు, నాలుగు గ్రామాలకు కలుపుకుని సమీపంలోని రైతువేదికల్లో లేదా పంచాయతీ కార్యాలయంలో ఒకే చోట నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో ఆర్భాటంగా మండల కేంద్రాలకు వెళ్లే బాధ తప్పుడంతో పాటు కాస్త ఖర్చులు కలుసొస్తాయని అభ్యర్థులు భావిస్తున్నారు. తనలాంటి పెద్ద గ్రామ పంచాయతీలో లక్ష రూపాయల వరకు ఖర్చు తగ్గుతుందని ఓ ఆశావహ అభ్యర్థి తెలిపారు.



మూడు గ్రామాలకు మొదటిసారి పంచాయతీల ఎన్నికలు

నారాయణఖేడ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మండలంలో మూడు గ్రామ పంచాయతీలకు మొదటిసారిగా ఎన్నికలు జరుగనున్నాయి. ఖేడ్ మండలంలో గతంలో 50 గ్రామపంచాయతీలు ఉండగా, నిజాంపేట మండలంగా ఏర్పడదంతో 6 గ్రామ పంచాయతీలను ఈ మండలంలో విలీనం చేశారు. ఖేడ్ పరిధిలో 44 గ్రామ పంచాయతీలు ఉండగా, మరో మూడు పంచాయతీలను కొత్తగా ఏర్పాటు చేశారు. దీంతో పంచాయతీల సంఖ్య 47కు చేరింది. నూతనంగా ఏర్పాటైన లింగనాయక్‌పల్లి, గుండు తండా, హనుమాన్ మందిర్ తండాల్లో ఈసారి పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తున్నారు. లింగనాయక్‌పల్లిలో 279 మంది ఓటర్లుగా ఉండగా, పురుషులు 136, స్త్రీలు 143 మంది ఉన్నారు. గుండు తండాలో 250 మంది ఓటర్లుగా ఉండగా పురుషులు 124, స్త్రీలు 126 మంది, హనుమాన్ మందిర్ తండా పంచాయతీలో 400 మంది ఓటర్లుగా ఉండగా పురుషులు 212, స్త్రీలు 188 మంది ఉన్నారు. మూడో విడతలో డిసెంబరు 17న ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో సర్పంచు, వార్డు సభ్యుల పదవులను దక్కించుకోవడానికి ఈ పంచాయతీల్లోని ఆశావాహులు పోటి పడుతున్నారు.



హనుమాన్ తండా గ్రామ పంచాయతీ

పంచాయతీ నుంచి శాసనసభకు

రాజకీయ అరంగేట్రానికి మొదటి మెట్టుగా స్థానిక ఎన్నికలు

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యేల ప్రస్థానం ఇక్కడి నుంచే..



బి.లక్ష్మీకాంతారావు, దేశిని చిన్న మల్లయ్య, చాడ వెంకటరెడ్డి, వొడితెల సతీష్‌కుమార్

హుస్నాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ జీవితాన్ని ప్రారంభించాలనుకునే నాయకులకు గ్రామ పంచాయతీ ఒక బలమైన వేదిక. పల్లె ప్రజల మన్ననలు పొంది సర్పంచ్‌లుగా ఎన్నికైన ఎంతో మంది ప్రజాప్రతినిధులు ఉన్నత శిఖరాలను అధిరోహించారు. నాటి ఇందుర్తి నుంచి పునర్విభజన అనంతర హుస్నాబాద్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పలువురు నేతలు సర్పంచ్‌గానే రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు.

సర్పంచ్‌గా మొదలైన ప్రస్థానం

హుస్నాబాద్‌కు చెందిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వియ్యంకుడు దివంగత బొప్పరాజు లక్ష్మీకాంతారావు మొదట హుస్నాబాద్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆయన 1951 నుంచి 1964 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. అనంతరం సమితి ప్రెసిడెంట్‌గా, ఆ తరువాత 1962, 1967, 1983 అసెంబ్లీ ఎన్నికల్లో ఇందుర్తి శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. ఇదే నియోజకవర్గంలోని చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన దివంగత దేశిని చిన్న మల్లయ్య 1957లో ఆ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై ఏకంగా 21 సంవత్సరాలు ఆ పదవిలో కొనసాగారు. తదుపరి ఇందుర్తి నియోజకవర్గం నుంచి 1978తో పాటు 1985, 1989, 1994 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది నాలుగు మార్లు శాసన సభ్యునిగా పనిచేశారు. ప్రస్తుత సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి సైతం 1981లో తన స్వగ్రామమైన చిగురుమామిడి మండలం రేకొండ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 1987 నుంచి వరుసగా మూడుసార్లు మండల పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఒకసారి జడ్పీటీసీ సభ్యునిగా కూడా ఎన్నికయ్యారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఇందుర్తి శాసన సభ్యునిగా విజయం సాధించి, సీపీఐ శాసనసభాపక్ష నేతగా కొనసాగారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ ఎమ్మెల్యేగా రెండు మార్లు గెలుపొందిన వొడితెల సతీష్‌కుమార్ తన రాజకీయ ప్రస్థానాన్ని 1995లోనే ప్రారంభించారు. ఆయన స్వగ్రామమైన సింగాపూర్ సర్పంచ్‌గా 1995 నుంచి 1999 వరకు పనిచేసారు. అనంతరం సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నికై, ఆ తర్వాత ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈ విధంగా అనేక మంది నేతలు పల్లెల నుంచే తమ రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, సర్పంచ్ పదవిని తొలి మెట్టుగా ఉపయోగించుకుని ఉన్నత పదవులను అలంకరించారు.

అబ్జర్వర్‌లు వచ్చేశారు..

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణను నిష్పాక్షికంగా, పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) రాష్ట్ర స్థాయి అధికారులను ప్రత్యేక పరిశీలకులుగా నియమించింది. నియమితులైన వారు గురువారం ఆయా జిల్లాల్లో పర్యటించి, నామినేషన్ల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు.

నామినేషన్ల ప్రక్రియ పరిశీలన

పోటీ చేసే అభ్యర్థులు నిబంధనల మేరకు నడుచుకోవాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక అధికారి ఉదయ్‌కుమార్

కంది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నడుచుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక అధికారి పి.ఉదయ్‌కుమార్ సూచించారు. సంగారెడ్డి జిల్లాకు సాధారణ పరిశీలకులుగా ఐఏఎస్ అధికారి పి.ఉదయ్‌కుమార్‌ను, వ్యయ పరిశీలకులుగా జిల్లా ఆడిట్ ఆఫీసర్ జి.రాకేష్‌ను ఎస్‌ఈసీ నియమించింది. ఈ మేరకు ఎన్నికల ప్రత్యేక అధికారి ఉదయ్‌కుమార్ గురువారం కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి కంది మండలంలోని కవలంపేట గ్రామ పంచాయతీ వద్ద జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ పత్రాలను ఆయన పరిశీలించారు. నామినేషన్లకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. అనంతరం వ్యయ పరిశీలకులు జి.రాకేష్ అధికారులతో సమావేశమై మాట్లాడుతూ.. అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి పైసాపై నిఘా ఉంచాలని, నిబంధనల మేరకు పారదర్శకంగా నడుచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



కంది మండలం కవలంపేటలో నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి ఉదయ్‌కుమార్, సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

నామినేషన్ ప్రక్రియ బేష్

అల్లాదుర్గం/టేక్మాల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ తీరు బేష్‌గా ఉందని ఉమ్మడి జిల్లా ఎన్నికల పరిశీలకురాలు బి.భారతి లఖ్‌పతి నాయక్ అధికారులకు కితాబు ఇచ్చారు. గురువారం ఆమె మెదక్ జిల్లాలోని అల్లాదుర్గం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్యతో కలిసి పరిశీలించారు. నామినేషన్ స్వీకరిస్తున్న తీరుపై అధికారులను ఆరా తీసి, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వేద ప్రకాశ్‌రెడ్డితో పాటు అధికారులను అభినందించారు. నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు విధిగా పాటించి, సజావుగా సాగేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా, టేక్మాల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకరణను పరిశీలకురాలు భారతి లఖ్‌పతి నాయక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి తనిఖీ చేశారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నామినేషన్ వేసే అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త బ్యాంకు అకౌంట్‌ను తీసుకోవాలని సూచించారు. వారి వెంట ఆర్డీవో మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

ములుగు/సిద్దిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అధికారులు బాధ్యతగా వ్యవహరిస్తూ నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ అనిత పేర్కొన్నారు. గురువారం ఆమె సిద్దిపేట జిల్లా ములుగు మండల పరిధిలోని సింగన్నగూడ, చిన్నతిమ్మాయిపల్లి క్లస్టర్ నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్‌లు వేయడానికి వచ్చిన అభ్యర్థులతో మర్యాదగా ప్రవర్తిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేరీ స్వర్ణలత, ఏపీఎం యాదగిరి పాల్గొన్నారు. సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు కే.హరిత, వ్యయ పరిశీలకులు ఎన్.నిశాంతి కలెక్టర్ కె.హైమావతి సమావేశమై గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి చర్చించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

ఏకగ్రీవం చేస్తే.. నా సొంతంగా రూ.10 లక్షలు ఇస్తా

- **బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**

గుమ్మడిదల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏకగ్రీవం చేస్తే ప్రతీ గ్రామానికి రూ.10 లక్షలు తన సొంతంగా అందిస్తానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో శాశ్వత అభివృద్ధి పనులు జరిగి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందాలంటే గ్రామాలు ఏకగ్రీవం కావాలని సూచించారు. గామాల్లో రోడ్లు, చెరువులు, మౌలిక వసతులు, పబ్లిక్ సర్వీసెస్ వంటి అంశాల్లో ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రయోజనాలు మరింత వేగంగా ప్రజలకు చేరేందుకు ఏకగ్రీవమే ఉత్తమ మార్గమని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. తాను అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, పటాన్‌చెరువు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తానని గోవర్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువత భారీగా హాజరయ్యారు.

పటాన్‌చెరులో నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు శుక్రవారం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం పటాన్‌చెరు మైత్రి మైదానంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 44వ తెలంగాణ అండర్ 14 ఖోఖో బాలబాలికల అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ 2025 పోటీలు 30వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు. ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారని అన్నారు. 33 జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు రానివ్వకుండా వసతి, భోజన సదుపాయాలను సొంతంగా కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడలకు పటాన్‌చెరును వేదికగా మారుస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఖోఖో ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్, కార్యదర్శి శ్రీకాంత్, సీఐ వినాయకరెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మూత దశకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్

- **పాఠశాల దూరం.. రవాణా సౌకర్యం కరువు**
- **400 మంది సామర్థ్యం ఉన్న తూప్రాన్ వసతి గృహంలో 38 మంది విద్యార్థులే!**

తూప్రాన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు వసతి కల్పిస్తూ నాణ్యమైన చదువుకు అవకాశం ఇవ్వాలనే మంచి లక్ష్యంతో ఏర్పాటు చేసిన సమీకృత వసతి గృహం (ఇంటిగ్రేటెడ్ హాస్టల్) ప్రస్తుతం మూతపడే దశకు చేరుకుంది. మంచి లక్ష్యంతో ప్రారంభమైనా, వసతి గృహం లక్ష్యం నెరవేరకపోగా, దశాబ్దంన్నర కాలంలోనే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. 400 మంది విద్యార్థులకు వసతి కల్పించే సామర్థ్యం ఉన్న ఈ హాస్టల్‌లో ప్రస్తుతం కేవలం 38 మంది విద్యార్థులు మాత్రమే ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. గురుకుల విద్యాలయాలు పెరగడం, ప్రధానంగా పాఠశాల దూరంగా ఉండటం వంటి కారణాలతో విద్యార్థులు హాస్టల్‌కు దూరమవుతున్నారు. ఇది తూప్రాన్ పట్టణంలోని సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహం (ఇంటిగ్రేటెడ్ హాస్టల్) పరిస్థితి.



తూప్రాన్ సమీకృత వసతి గృహ భవనం

రవాణా సౌకర్యం కల్పించాలి



విద్యార్థుల సంఖ్య పెంచేందుకు రవాణా సౌకర్యం కల్పించాలి. కరోనా వచ్చినప్పటి నుంచి విద్యార్థుల సంఖ్య బాగా పడిపోయింది. పాఠశాల దూరంగా ఉండటం, రవాణా సౌకర్యం లేకపోవడం వల్లే విద్యార్థులు చేరేందుకు ముందుకు రావడంలేదు. విద్యార్థులు హైవే రోడ్డు మీదుగా నడిచి వెళ్లాలంటే భయంగా ఉంటుంది,

\- వై.జనార్ధన్, వసతి గృహ సంక్షేమ అధికారి

నిర్మాణం.. లక్ష్యం

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం కోసం సాంఘిక సంక్షేమ శాఖ తూప్రాన్ పట్టణాన్ని ఎంపిక చేసింది. 2009లో హాస్టల్ నిర్మాణానికి రూ.1.68 కోట్లు మంజూరు చేయగా, 2.20 ఎకరాలను కేటాయించారు. అప్పటి మంత్రి గీతారెడ్డి శంకుస్థాపన చేయగా, 2011లో నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చింది. తూప్రాన్‌లోని బీసీ హాస్టల్‌తోపాటు, తూప్రాన్, వెల్దుర్తి, చేగుంట మండలం చందాయిపేటల్లోని ఎస్సీ హాస్టళ్లు కలిపి మొత్తం నాలుగు హాస్టళ్లను రద్దు చేసి, వాటిలోని 400 మంది విద్యార్థులతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను నిర్వహించారు. ప్రారంభంలో నలుగురు వార్డెన్లు, కమాటీ, కుక్, వాచ్‌మెన్ పోస్టులు ఉండేవి. విద్యార్థుల సంఖ్య తగ్గడం వల్ల ఒక్కొక్క పోస్టు రద్దు చేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఎస్సీ సంక్షేమశాఖ నుంచి ఒక వార్డెన్‌ను నియమించగా, బీసీ సంక్షేమశాఖ చేగుంట వార్డెన్‌కు అదనపు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

పడిపోతున్న విద్యార్థుల సంఖ్య

తూప్రాన్ ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. ప్రారంభంలో నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన విద్యార్థులు అధికంగా చేరడంతో హాస్టల్ కళకళలాడింది. కొన్నేళ్లు సజావుగా సాగినా, విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. కరోనాకు ముందు విద్యార్థుల సంఖ్య 105కు తగ్గింది. 2021లో కరోనా ప్రభావంతో విద్యార్థుల సంఖ్య 33 మందికి పడిపోయింది. 2022లో 30 మందికే పరిమితమైంది. 2023లో 40 మంది విద్యార్థులు చేరారు. 2024 70 మంది విద్యార్థులకు చేరుకున్నది. ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య 38 మందికి పరిమితమైంది. వీరిలో కూడా 30 మంది మాత్రమే వసతి గృహంలో ఉంటున్నారు.

దూరంగా ఉన్న పాఠశాల

తూప్రాన్ పట్టణంలో సమీకృత వసతి గృహం పాఠశాలలకు దూరంగా ఉండటమే విద్యార్థులు చేరకపోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నుంచి తూప్రాన్ హైస్కూల్ కిలోమీటరున్నర దూరం, ప్రాథమిక పాఠశాలకు రెండు కిలోమీటర్లకు పైగా దూరం ఉంది. విద్యార్థులు పాత హైవే రోడ్డు మీదుగా కాలినడకన వెళ్లాల్సి వస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు సుముఖత చూపడం లేదు. గతంలో నారాయణఖేడ్ ప్రాంతం నుంచి సుమారు 100 మందికిపైగా విద్యార్థులు ఇక్కడ చేరేవారు. ప్రస్తుతం జిల్లా మారిపోవడం, నారాయణఖేడ్‌లోనే హాస్టల్ వసతి లభించడంతో అక్కడి విద్యార్థులు ఈ హాస్టల్‌కు రావడం తగ్గింది. గత ఏడాది హాస్టల్ వార్డెన్ వై. జనార్ధన్ చొరవ తీసుకొని విద్యార్థులకు సొంత ఖర్చులతో పాఠశాలకు వెళ్లేందుకు వాహన సౌకర్యం కల్పించడంతో కొంత మెరుగ్గా విద్యార్థులు హాస్టల్‌లో చేరారు.

గురుకులంగా మార్చాలనే అభిప్రాయం

తూప్రాన్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను గురుకులంగా మార్చితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీంతో హాస్టల్‌కు దూరంగా ఉన్న పాఠశాలలకు నడిచి వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగుతాయని చెబుతున్నారు. గురుకుల పాఠశాల నిర్వహణకు అవసరమైన వసతి గదులు కూడా ఇక్కడ ఉన్నాయి. గురుకులంగా మార్చలేని పక్షంలో, వృథాగా ఉన్న బీసీ హాస్టల్ భవనంలోకి మార్చితే సమస్యలు తీరిపోతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కొద్దిపాటి మరమ్మతులు చేస్తే బీసీ హాస్టల్ భవనం విద్యార్థులకు అందుబాటులోకి వస్తుంది. ఈ దిశగా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వసతి గృహం నుంచి నడిచి వెళుతున్న విద్యార్థులు



రవళిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు రవళి

హుస్నాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు నెలలో ఒడిశా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు హుస్నాబాద్ పట్టణానికి చెందిన పచ్చిమట్ల రవళి ఎంపికైంది. ఈ సందర్భంగా గురువారం బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబుతో పలువురు శాలువాతో సన్మానించారు. పోటీలు జరిగే ఒడిషా రాష్ట్రానికి వెళ్లడానికి రవాణా ఖర్చులకు డబ్బులు అవసరం పడుతాయని తమకు తెలుపగా తమ వంతుగా సహాయం చేశామని శంకర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్, వేముల దేవేందర్‌రెడ్డి, అనంతస్వామి, రాజేందర్, సంతోష్ తదితరులున్నారు.

న్యూస్ బాక్స్

పాపన్నపేట ఏడీఈగా వెంకటేశ్వర్‌రావు

పాపన్నపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పాపన్నపేట విద్యుత్ సబ్ డివిజనల్ ఏడీఈగా వెంకటేశ్వర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిన్నారం ఏఈగా ఉన్న ఈయన ఏడీఈగా పదోన్నతి పొంది ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజనల్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది ఆయనను సన్మానించారు.

'కడియం' నోరు అదుపులో పెట్టుకోవాలి

జహీరాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న మాజీ మంత్రి కడియం శ్రీహరి నోరును అదుపులో పెట్టుకుని మాట్లాడాలని బీఆర్ఎస్ ఎస్సీసెల్ జహీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాకేష్ హితవు పలికారు. గురువారం జహీరాబాద్‌లో వారు మాట్లాడుతూ ఆధారాలు లేకుండా రాజకీయ లబ్ధి కోసం కడియం ఎదుటి వారిపై బురద జల్లడం తగదన్నారు. బీఆర్ఎస్‌లో లబ్ధిపొంది అవకాశ వాదంతో బిడ్డ రాజకీయం కోసం కాంగ్రెస్‌లో కలవడం ఎంతవరకు సమంజసమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి మాటలు పునరావృతమైతే కడియం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలి

చిన్నశంకరంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్ అన్నారు. గురువారం చిన్నశంకరంపేట పీహెచ్సీ వద్ద 108 అంబులెన్స్ వాహనాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ప్రమాదాలు జరిగితే క్షణాల్లో స్పందించి వెంటనే వారిని ఆస్పత్రులకు తరలించాలని ఈఎంటీ గణేష్, పైలెట్ విజయ్‌కు సూచించారు. అనంతరం మందుల నిల్వ, రికార్డులను పరిశీలించారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

వెల్దుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో రైతు అధిక లాభాలు పొందవచ్చని ఏఈవో మజీద్‌అలీ అన్నారు. గురువారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో గంధం పోచమ్మ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు నడపాలి

జిన్నారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం జిన్నారం సహా సమీప గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని జిన్నారం గ్రామానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు జీడిమెట్ల డిపో అధికారులను కోరారు. సికింద్రాబాద్ నుంచి జిన్నారం, ఊట్ల వరకు గతంలో నడిచే బస్సును పునరుద్ధరించాలని, ఇతర సర్వీసుల సంఖ్యను పెంచాలని కోరారు. ఇందులో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బ్రహ్మేందర్‌గౌడ్, నిఖిల్‌గౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

ఆటోడ్రైవర్ అదృశ్యం

● పోలీసులకు ఫిర్యాదు

మాసాయిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ అదృశ్యమైన సంఘటన మాసాయిపేటలో చోటు చేసుకున్నది. మాసాయిపేటకు చెందిన సన్‌జోర్ యాదగిరి ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 24న కిరాయికి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో భార్య రేణుక గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సామగ్రి వితరణ

నారాయణఖేడ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్‌లోని జడ్పీ హెచ్ఎ పాఠశాలలో 80 మంది విద్యార్థులకు ఖేడ్ ఆర్టీసీ డీపో ఏఈఎం శ్రీనివాస్‌రావు, తన సతీమణి ఝాన్సీలక్ష్మి అమెరికాలో ఉన్న తమ కూతురు బిందుసాహితి, సంతోష సహకారంతో రాత పుస్తకాలు, పెన్నులు, ఇతర విద్యా సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తాను సైతం మారుమూల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

సమన్వయంతో పనిచేసి సత్తాచాటాలి : ఎమ్మెల్యే

హత్నూర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం హత్నూర మండలం మంగాపూర్ గ్రామంలోని రాష్ట్ర మాజీ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల్లో విభేదాలు పక్కన పెట్టి సమన్వయంతో అభ్యర్థిని ఎంపిక చేసుకొని గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింలు, మాజీ జడ్పీటీసీ ఆంజనేయులుతో పాటు పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



మెదక్‌లో సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

పంచాయతీ ఎన్నికల్లో విజయఢంకా మోగించాలి

మెదక్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయఢంకా మోగించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం మెదక్ పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ పరిధిలోని మండల, గ్రామ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు నెగ్గితే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ అభ్యర్థుల విజయమే గ్రామాల అభివృద్ధికి పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ కౌన్సిలర్ బట్టి సులోచన కుమారుడు బట్టి వంశీ అనారోగ్యానికి గురై, చికిత్స పొందుతుండగా ఆయన పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎంపీ

సదాశివపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గురువారం సదాశివపేట పట్టణంలోని 11, 8వ వార్డుల్లో రూ.25 లక్షలతో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను ఎంపీ ప్రారంభించి మాట్లాడారు. తానూ సదాశివపేట ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, పట్టణాభివృద్ధికి ఎంపీగా రానున్నరోజుల్లో భారీగా నిధులు తెచ్చేందుకు కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు బీజేపీ కౌన్సిలర్లు ఓదెల మాణిక్‌రావు, ఓదెల రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ శివాజీ, సంగారెడ్డి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



11వ వార్డులో ఓదెల మాణిక్‌రావుతో కలిసి అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న రఘునందన్‌రావు

అట్టహాసంగా అయ్యప్ప మహాపడిపూజ

నారాయణఖేడ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహంలో గురువారం పురోహితులు మలమంచి మోహన్‌జ్యోషి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడి పూజను అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అనుపమ్మరెడ్డి దంపతులు మొదటిసారి మాల ధరించిన వారి కుమారుడు అనురాగ్‌రెడ్డితో పాటు వారి కుటుంబీకులు, ఖేడ్ నియోజకవర్గంలోని అయ్యప్పస్వామి దీక్షాధారులతో కలిసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ఉంచి మహాపడిపూజను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించారు. అయ్యప్పస్వామి భక్తి గీతాలను ప్రముఖ సంగీత కళాకారులు నర్సింహా బృందం అలరించడంతో విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, పంచగామ మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సుధాకర్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న సంజీవరెడ్డి, అనుపమారెడ్డి దంపతులు, వారి కుమారుడు కన్నె స్వామి అనురాగ్‌రెడ్డి

ఉచిత వైద్యమందించేందుకు ముందుకురావాలి

● ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

జిన్నారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉచిత వైద్యసేవలందించేందుకు స్వచ్ఛంద, వైద్య సంస్థలు ముందుకురావాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. గురువారం జిన్నారం మండలం కాజీపల్లి జీఎంఆర్ కాలనీలో ఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు రమాకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శంభీపూర్ రాజు, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. నగర శివారు ప్రాంతాల బస్తీవాసుల కోసం ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో తరచూ వైద్య శిబిరాలను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. 32 మందిని పలు శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు క్రీడాకారులు

తూప్రాన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ పరిధి తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-14 టచ్ రగ్బీ జట్లు ఎంపిక చేసినట్లు రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు నాగరాజు, సౌందర్య, శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ప్రతిభ ఆధారంగా ఎంపికలు చేసినట్లు వివరించారు. బాలికల విభాగంలో ఆశ్రిత, స్ఫూర్తి, నమ్రూన్, ప్రశాంతి, మనస్విని, వైష్ణవి, నిషిత, రాజేశ్వరీ, శాశ్విత, నందిని, శ్రీవల్లి, ప్రణవ్య, స్టాండ్ బైగా ప్రవస్థి, హేమలత, అలేఖ్య, నందిని, మైత్రి, ధనుషా ఎంపికయ్యారని తెలిపారు. బాలుర విభాగంలో రిశాంక్, సాయి రిస్వత్, అభిషేక్, సాత్విక్, నవదీప్, గౌతమ్, రిషి, నమృత్‌రెడ్డి, చరణ్, బద్రీనాథ్, చందు, స్టాండ్‌బైగా రిత్విక్, అజయ్, సాత్విక్, అభిషేక్, మహేశ్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. గురుకులంలో కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12 మంది బాలురు, 12 మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు వివరించారు. ప్రిన్సిపాల్ సుహాసిని, అసోసియేషన్ అధ్యక్షుడు గణేశ్ రవికుమార్ పాల్గొన్నారు.

తూప్రాన్‌లో

తూప్రాన్‌లోని ((21సోషల్ వెల్ఫేర్ బాలుర పాఠశాల గ్రౌండ్‌లో జరిగిన ఎస్జీఎఫ్ అండర్ 14 బాలబాలికల క్రీడల్లో నిజాంపేటకు చెందిన విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. ఉమ్మడి మెదక్ జిల్లా రగ్బీ ఎంపికలో మండల కేంద్రానికి చెందిన శివ తరగతి విద్యార్థి కే.బద్రీనాథ్ ఎంపికైనట్లు నిజాంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం మహేందర్, పిడి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ జడ్పీటీసీ



హరీశ్‌రావు, సునీతారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న మాజీ జడ్పీటీసీ ఆంజనేయులు

హత్నూర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల మాజీ జడ్పీటీసీ ఆంజనేయులు కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో గురువారం చేరారు. హత్నూర మండలం బోర్పట్ల గ్రామానికి చెందిన పొట్లచెరువు ఆంజనేయులు గతంలో కాంగ్రెస్ నుంచి ఎంపీపీగా గెలుపొందారు. అనంతరం రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్‌లో చేరి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అనుచరుడిగా మండలంలో కీలకంగా వ్యవహరించారు. గత జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జడ్పీటీసీగా విజయం సాధించి మండలంలో తన ముద్ర వేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గత ఎంపీ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్‌రే రాజీనామా చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా.. ఆంజనేయులుగౌడ్ సైతం చేరారు. ప్రస్తుతం హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి సమక్షంలో తన అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : రాజిరెడ్డి



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలో ఆహ్వానిస్తున్న రాజిరెడ్డి.

వెల్దుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దామరంచ గ్రామానికి చెందిన 25 మంది వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

చేగుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు పీఎంశ్రీ చందాయపేట, చేగుంట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంటర్ మోరల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా గురువారం ఫిజికల్ డైరెక్టర్ శంకర్, శారద, విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ అథ్లెటిక్స్ క్రీడలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయి క్రీడలకు పంపిస్తామని ప్రధానోపాధ్యాయుడు కిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింలు, సలీం, రఘుపతి, లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలపై పోలీసుల దాడి

అల్లాదుర్గం/మునిపల్లి/తూప్రాన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పలు మద్యం దుకాణాలపై పోలీసులు గురువారం దాడిచేశారు. అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌కు చెందిన చెన్నారావు, శివకుమార్ అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడిచేసి మద్యాన్ని పట్టుకున్నామని ఎస్ఐ శంకర్ తెలిపారు. మునిపల్లి మండలం కంకోల్ గ్రామానికి చెందిన పెద్దాపురం రాజు, మన్నె నవీన్ దుకాణాలపై దాడులు చేసి మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు. తూప్రాన్ పట్టణ పరిధి హైదర్‌గూడలో తూప్రాన్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో ఉమామహేశ్వర్ వద్ద 20 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి.

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

● సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

● బోర్పట్ల నామినేషన్ కేంద్రంలో పరిశీలన

హత్నూర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నామినేషన్ వేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనను తూచా తప్పకుండా పాటించాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం హత్నూర మండలం బోర్పట్ల గ్రామంలోని నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

●కల్హేర్/సిర్గాపూర్ : సిర్గాపూర్ మండలంలో సర్పంచ్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు గ్రామ పంచాయితీ కార్యదర్శులు విశేష కృషి చేయాలని సిర్గాపూర్ ఎంపీడీవో శారద సూచించారు. సిర్గాపూర్‌లోని ఎంపీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు.

●చిన్నశంకరంపేట: ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీవో దామోదర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 30 నుంచి సర్పంచ్ ఎన్నికల నామినేషన్ పర్వం ప్రారంభం కానుందన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

●రేగోడు: పంచాయతీ ఎన్నికల్లో నిబంధనలు తప్పనిసరి అని ఎస్ఐ పోచయ్య అన్నారు. గ్రామాల్లో ర్యాలీలు, సమావేశాలు, సభలు, మైకులు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

●కోహీర్: ఈనెల 30వ తేదీ నుంచి రెండోవిడతల్లో జరుగనున్న సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ వంటి అంశాలపైన కోహీర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, టీవోటీలు వల్లబ్‌జోష్, సురేష్, ఎంవోటీ శంకర్, ఎంపీవో వెంకట్‌రెడ్డి, ఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

●మనూరు: మండల కేంద్రమైన మనూరులో గ్రామ పంచాయతీ ఎన్నికల శిక్షణ నిర్వహించినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియపై రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు, టీవోటీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వై.రఘు, శేషు, ఎంఈవో రాజశేఖర్ షెట్కార్ పాల్గొన్నారు.

●కంగ్టి: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని కంగ్టి, తడ్కల్, బాన్సువాడ, దామర్‌గిద్ద, జంగి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో సత్తయ్య, ఎస్ఐ దుర్గారెడ్డి పరిశీలించారు.

●జహీరాబాద్ రూరల్: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో రెండో విడతలో జరిగే సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణకు క్లస్టర్లు ఏర్పాటు చేశామని ఎంపీడీవోలు మహేందర్‌రెడ్డి, మహేష్ గురువారం తెలిపారు. జహీరాబాద్ మండలంలోని 25 గ్రామపంచాయతీలకుగాను 6 క్లస్టర్లను ఏర్పాటు చేశామన్నారు.



సంగారెడ్డి మండలం తాళ్లపల్లిలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అంరని యశోధ

నాణ్యమైన విద్యనందించాలి : డీఈవో

హత్నూర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించినప్పుడే చదవడం, రాయడం వస్తుందని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం హత్నూర మండలం బోర్పట్ల ప్రాథమిక పాఠశాలను డీఈవో వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. విద్యార్థులకు కనీస సామర్థ్యం చదవడం, రాయడం వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందినప్పుడే ఉత్తీర్ణత శాతం పెరుగుతుందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని అన్నారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, తరగతి గదిలో విద్యార్థులతో పలు సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి సమాధానాలు విద్యార్థుల నుంచి రాబట్టారు.

బాలికల భవిష్యత్ కోసం ముందుకు రావాలి

● మెదక్ అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాలికల భవిష్యత్ కోసం సమాజం ముందుకురావాలని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికల విద్య సామాజిక పురోగతికి పునాదని, విద్య అమ్మాయిలకు శక్తి, ధైర్యం, సొంత నిర్ణయాలు తీసుకునే ఆత్మవిశ్వాసం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో విజయ, ఎస్ఐ సుచిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు జరగాలి

పాపన్నపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు జరగాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. గురువారం యూసఫ్‌పేట్ గ్రామంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం ఇప్పటివరకు 63,352 మంది రైతుల నుంచి 2,42,104.040 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.401.69 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు.

కురుమలు అన్నిరంగాల్లో రాణించాలి

కంగ్టి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కురుమలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో రాణించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్‌శెట్టి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగూర్.బిలో ఏర్పాటుచేసిన భూంగొండేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గొల్ల కురుమలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీర్‌గొండ, చంద్రుగొండ, లాలప్ప, కాశీనాథ్, సిద్దుగొండ, బసప్ప, నాగ్‌గొండ పాల్గొన్నారు.

నెరవేరిన బస్తీదర్శన్‌లో హామీ

రామచంద్రాపురం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. గతంలో బస్తీదర్శన్ నిర్వహించిన సమయంలో ఇచ్చిన హామీమేరకు గురువారం రామచంద్రాపురం డివిజన్ పరిధి కాకతీయనగర్ కాలనీలో రూ.44 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించి, మాట్లాడారు. నిత్యం కాలనీల్లో సౌకర్యాలు కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నరేంద్రబాబు, ప్రభాకర్‌రెడ్డి, రాములు, ఉమాశంకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం

కొండాపూర్/సంగారెడ్డి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అండర్-14 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. కొండాపూర్ మండలం చీమలదారి కోనాపూర్ ఎంపీ క్రికెట్ మైదానంలో తొలిరోజు ఎల్లో టీమ్, బ్లూ టీమ్ మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన బ్లూ జట్టు 50 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 328 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎల్లో జట్టు 231 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 97 పరుగులతో బ్లూ జట్టు విజయం సాధించింది. అదే విధంగా పీబీఆర్ మైదానంలో జరిగిన రెండవ లీగ్ మ్యాచ్‌లో గ్రీన్ టీమ్, రెడ్ టీమ్ జట్లు తలపడ్డాయి. ఇందులో మొదట బ్యాటింగ్ చేసిన గ్రీన్ జట్టు నిర్ధారిత 40 ఓవర్లలో 187 పరుగులు చేసింది. ఆ తర్వాత రెడ్ జట్టు 188 పరుగులు చేసి విజయం సాధించింది.

తపస్ మండల కమిటీలు ఎన్నిక

నారాయణఖేడ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఖేడ్ మండల కార్యవర్గాన్ని గురువారం నారాయణఖేడ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రతన్‌సింగ్, గౌరవ అధ్యక్షుడిగా వడ్ల రాజయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నందప్ప, ప్రతాప్, మహిళా కార్యదర్శిగా మహాదేవి, కోశాధికారిగా యోగేష్, చాప్టా.కె కాంప్లెక్స్ కన్వీనర్‌గా అనంతపద్మనాభం, సంజీవన్‌రావుపేట కాంప్లెక్స్ కన్వీనర్‌గా సుదర్శన్, ఖేడ్ కాంప్లెక్స్ కన్వీనర్‌గా జగదీశ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులు, పరిశీలకులుగా రాష్ట్ర బాధ్యులు పెంటారెడ్డి, సునార్‌రమేష్, దత్తాత్రి, సుధాకర్, వ్యవహరించారు.

మనూరు కమిటీ ఎన్నిక

మనూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తపస్ మనూరు మండల అధ్యక్షుడిగా మశ్చేందర్, ప్రధాన కార్యదర్శిగా మహేష్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా అవుసలి వెంకటేశం, ఉపాధ్యక్షులుగా రఘు, రాజు, కోశాధికారిగా అంజయ్య, బోరంచ, మనూరు, కాంప్లెక్స్ కన్వీనర్లుగా గోవర్ధన్, మల్లికార్జున్, కోకన్వీనర్లుగా శేరి రాజు, శివకుమార్‌ను ఎన్నుకున్నారు.

ఖజానా ఉద్యోగి అసభ్య మాటలపై ఫిర్యాదు

తూప్రాన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలోని డివిజన్ ఖజానా కార్యాలయ ఉద్యోగి అసభ్య మాటలతో ఇబ్బందులు గురవుతున్నట్లు డివిజన్ ఉద్యోగులు పేర్కొన్నారు. గురువారం జిల్లా ఖజానా అధికారికి ఫిర్యాదు చేశారు. తూప్రాన్ ఏటీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్(కవిత) ఇబ్బందులు పెడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్టీవో, ఏటీవో సంతకాలు(టీబీఆర్, బిల్లులపై) చేసినప్పటికీ బిల్లులు తీసుకోకుండా.. బిల్లులు తీసుకెళ్లిన అంటెండర్, అసిస్టెంట్లు, జూనియర్ సహాయకులను ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుందన్నారు. మహిళా డీడీవో అధికారులను సైతం చీదరించుకుంటూ అసభ్యంగా మాట్లాడుతున్నట్లు వివరించారు. అధికారులు స్పందించి ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమావేశాలు పెడుతున్నాం

● నిజాంపేట సొసైటీ చైర్మన్

నిజాంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సొసైటీలో పాలకవర్గ సమావేశాలు జరపటం లేదనటంలో నిజం లేదని పాక్స్ చైర్మన్ బాపురెడ్డి కొట్టిపారేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ విషయమై డీసీవోకు ఫిర్యాదు చేయడాన్ని ఖండించారు. ప్రాథమిక సహకార సంఘ ఎన్నికలు జరిగి ఐదేళ్లవగా.. ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా ఆరునెలలకు ఒకసారి పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో సభ్యులు సంతకాలు కూడా చేసిన సాక్ష్యాలు చూపుతామని పేర్కొన్నారు. అయినా పలువురు ఆధారాలు లేకుండా సొసైటీపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు కిష్టారెడ్డి, బండారి ఎల్లయ్య, అబ్దుల్ అజీజ్, శ్రీధర్‌రెడ్డి, బజారు స్వామిగౌడ్, దుర్గయ్య శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రామనామ స్మరణతో శుభాలు

పాపన్నపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ నిత్యం రామరామస్మరణతో సకల శుభాలు కలుగుతాయని స్వామి సమర్థ మహరాజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తలింగాయిపల్లి గ్రామంలో నిర్వహించిన రామనామస్మరణ గురువందనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. నిత్యం రామనామస్మరణ చేయడం ద్వారా ఎంతో పుణ్యం కలుగుతుందన్నారు.



భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న స్వామి